www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 12 డిసెంబర్ 2024

అద్దె సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలోని మున్సిపల్ దుకాణాలకు సంబంధించిన అద్దె సకాలంలో, సక్రమంగా చెల్లించాలని సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్ దుకాణాదారులకు సూచించారు. కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు.. సహాయ కమిషనర్ ఆధ్వర్యంలో.. రెవెన్యూ అధికారులు బుధవారం సాయంత్రం నగరంలోని జైహింద్ కాంప్లెక్స్, కస్తూరిబా మున్సిపల్ కాంప్లెక్సులలో దుకాణాల అద్దె వసూళ్లు చేపట్టారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ మాట్లాడుతూ దుకాణదారులు అద్దె బకాయిలను సత్వరం చెల్లించాలన్నారు. అద్దె చెల్లించని దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. నగరంలోని అన్ని మున్సిపల్ కాంప్లెక్స్‌లకు సంబంధించి దీర్ఘకాలికంగా అద్దె బకాయిలు ఉన్న దుకాణాదారులకు నోటీసులు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్వోలు గోపాలకృష్ణ వర్మ, ఉమామహేశ్వర్ రెడ్డి, ఆర్ఐ దొరై, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యస్వామి ఆలయాభివృద్ధికి

ప్రణాళికలు సిద్ధం చేయండి

కడా పీడీ వికాస్ మరమత్

దేవాలయాన్ని సందర్శిస్తున్న కడా పీడీ

ప్రజాశక్తి- కుప్పం రూరల్

ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కడా పిడి వికాస్ మరమత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కుప్పం మండల పరిధిలోని చెక్కునత్తం పంచాయతీ కూసూరు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలోని సుబ్రహ్మణ్యస్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలియజేస్తూ, వాటికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు సత్యేంద్ర శేఖర్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, క్లస్టర్ ఇంచార్జి మహేంద్ర బాబు, చెక్కునత్తం మణి, మురళి, సంతోష్, వెళ్ళప్ప, కనకరాజు, సుందర్, మనోహర్, ఎత్తిరాజులు పాల్గొన్నారు.

పింఛన్.. టెన్షన్

కోతలకు రంగం సిద్ధం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఒకటో తేదీ వస్తోందంటే.. సామాజిక పింఛనుదారుల కళ్ళల్లో ఆనందం ప్రభుత్వం నుండీ నాలుగువేలు పింఛన్ రూపంలో వస్తోందని. ఇలా ఇచ్చే పింఛన్ డబ్బులు తమ అవసరాలను తీరుస్తుందని ఆశిస్తున్న పింఛనుదారుల్లో టెన్షన్ మొదలైంది. కూటమి ప్రభుత్వం సామాజిక పింఛన్ తనిఖీలు మొదలు పెట్టింది.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సామాజిక పింఛన్‌లు నాలుగువేలకు పెంచింది. ఆరు నెలలుగా నాలుగువేలు అందుకుంటున్న లబ్ధిదారుల్లో ఇటీవల ప్రభుత్వం లబ్ధిదారులు అర్హులా.. అనర్హులా.. అని తేల్చేలా సర్వేలు మొదలెట్టింది. పింఛన్ కోసం నానాపాట్లు పడి సదరం సర్టిఫికేట్లు అందజేసి ప్రభుత్వ అధికారులు అర్హులుగా గుర్తింపు పొందిన వారు ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ అర్హత నిరూపించుకోవాలంటే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

17 మందిని అనర్హులుగా..

పింఛన్‌ల తనిఖీ ప్రారంభించిన ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా చిత్తూరు రూరల్ మండలం ముట్టుకూరు గ్రామ పంచాయతీని ఎంపిక చేసింది. ఈనెల 9వ తేదీ 11 బృందాలు 22 మంది అధికారులు సర్వే నిర్వహించారు. 434 పింఛనుదారులను తనిఖీ చేశారు. ఇందులో 17 వికలాంగ పింఛన్లు సదరం సర్టిఫికేట్లు తప్పులున్నట్లు గుర్తించారు. అలాగే వింతు, వృద్ధాప్య పింఛనుదార్లులో కూడా అనర్హులున్నట్లు గుర్తించారు. సర్వే నివేదిక బహిరంగ పరిచేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. ఈ లెక్కన చూస్తే ప్రభుత్వ నిబంధనల మేరకు పింఛన్లు భారీగా తొలగించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

తనిఖీ ఇలా..

పింఛన్ల అర్హతను తెల్చేలా ప్రభుత్వం తనిఖీ ఇలా సాగింది. పింఛన్ పొందుతున్న లబ్ధిదారుల కుటుంబాల్లోని వారు ఉద్యోగాల్లో ఉన్నారా, వెయ్యి గజాలకన్న ఇంటి నిర్మాణం అదనంగా ఉందా, విద్యుత్ వినియోగం 300 యూనిట్లలోపు ఉందా, నాలుగు చక్రాల వాహనాలున్నాయా, మాగాణి ఎకరం కంటే అదనంగా ఉందా, ఆదాపు పన్ను చెల్లింస్తున్నారా, కుటుంబ సభ్యులు ఎవరైనా ప్రైవేటు సంస్థల్లో పని చేస్తున్నారా విభిన్న ప్రతిభావంతుల విషయంలో సదరం సర్టిఫికెట్‌లో ఉన్నట్లుగా వికలాగత్వం ఉందా, వైద్యపరీక్షలకు సిఫారస్తు చేస్తున్నారా వింతతులు, ఒంటరి మహిళలు పునర్వివాహం చేసుకున్నారా ఇలాంటి సమచారాన్ని సేకరించి ఈ వివరాలను యాప్‌లో ఫేషియల్, బయోమెట్రిక్ తీసుకున్నారు.

పింఛన్ల కుదింపుకే సర్వేలు..

వితంతు, వృద్ధాప్య, వికలాంగ, కల్లుగీత, డప్పు, ఒంటరి మహిళ, కీడ్నీ వ్యాధిగ్రస్తులు ఇలా చిత్తూరు జిల్లాలోని 32 మండలాల్లో 2,67,936 వివిధ రకాల సామాజిక పింఛన్ పొందుతున్న లబ్ధిదారులు ఉన్నారు. వీరికి నెలకు రూ.113.31 కోట్లు పింఛన్ల రూపంలో ప్రభుత్వం అందిస్తోంది. రంగాల వారీగా చూస్తే వృద్ధాప్య 1,41,385, వితంతు 5,96,38, చేనేత 2,442, వికలాంగులు 35,374, అభయ హస్తం 11,366, హిజ్రాలు 32, ఒంటరి మహిళ 5,724, ఫిషరీస్ 245, డప్పు కళాకారులు 6,212 ఉన్నారు. పింఛన్ల సర్వే పైలెట్ ప్రాజెక్టుగా అనర్హులను గుర్తింస్తున్న ప్రభుత్వం రెండో విడతలో సామాజిక పింఛన్ లబ్ధిదార్లను పూర్తిస్థాయిలో సర్వే చేసి నిబంధనల పేరిట పింఛన్లను కుదించే కుట్ర చేస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అర్హులకు అన్యాయం చేస్తే ఊరుకోం..

-వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కన్వీనర్

సర్వేల పేరిట అర్హులను అనర్హులుగా గుర్తించి అన్యాయం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తు ఊరుకొనేది లేదు. ప్రభుత్వాలు మారినప్పుడలా.. సర్వేల పేరిట ఇబ్బందులకు గురి చేయడం సరికాదు. సంక్షేమ పథకాలు ప్రకటిస్తున్నాయి. రాజకీయలకు అతీతంగా నిజమైన అర్హులకు అందేలా చూడాలి. అనర్హులు అర్హులుగా ఉంటే మంజూరు చేసి అధికారులపై చర్యలు తీసుకోవాలి తప్పా సర్వేల పేరిట లబ్ధిదార్లును ఆదోళనకు గురి చేయడం సరికాదు. అనర్హుల ఏరివేత సర్వే పారదర్శంగా ఉండాలి.

అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే

- రూ.29.21లక్షలతో ఆరు బోర్లు, మోటర్లు ప్రారంభం

బోరు మోటర్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఏ గురజాల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ.. ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసం కృషి చేస్తున్నామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. నగరంలో నీటి సమస్య పరిష్కరించడం, ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలను అందించడంలో భాగంగా బుధవారం నగరంలో ఆరు ప్రాంతాల్లో వేసిన రూ.29.21 లక్షల విలువైన బోర్లను, రూ.1.20 కోట్ల విలువైన పెద్ద స్వీపింగ్ యంత్రాలు కలిగిన వాహనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో నీటి సమస్యలు పరిష్కరించి ప్రజలకు మెరుగైన నీటి సరఫరా అందించడమే లక్ష్యంగా 20కి పైగా బోర్లు వేసి మోటార్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వివిధ ప్రాంతాల్లో పర్యటనల సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. గడిచిన ఐదేళ్లతో పోలిస్తే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఎక్కువ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. నగర ప్రజలకు మరింత మెరుగైన పారిశుద్ధ్య సేవలను అందించడంలో భాగంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రెండు పెద్ద స్వీపింగ్ యంత్రాలు తెప్పించామన్నారు. వీటి ద్వారా మెయిన్ రోడ్లను సులభంగా.. వేగంగా.. శుభ్రం చేయవచ్చని వివరించారు. చిన్నపాటి వీధుల్లో చెత్త సేకరణ కోసం మూడు ఈ-ఆటోలను ప్రారంభించారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం మరిన్ని వాహనాలను తెప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. బుధవారం 6వ వార్డు పరిధిలో కనికాపురం, 22వ వార్డు తేనెబండ పరిధిలో జీఎంఆర్ గార్డెన్, గంగా కాలనీ, 18వ వార్డు పరిధిలో కెప్టెన్ స్ట్రీట్, సావిత్రమ్మ కాలేజ్, పీవీకేఎన్ కాలేజ్ లో బోరు, మోటార్లను తరలించారు. కార్యక్రమంలో మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజహసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్. మనోహర్, సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి పాల్గొన్నారు.

అందరికీ ఆయుర్వేద వైద్యసేవలు

ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు

ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న ఎంపి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రాచీన వైద్యవిధామైన ఆయుర్వేద వైద్య (ఆయుష్మాన్) సేవలను అందరికి అందించాలనే సంకల్పంతో, కేంద్ర ప్రభుత్వం సమగ్రమైన ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సంస్కరణలకు నాంది పలికిందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఏహెచ్‌డ్యూసిఎస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి, మొండి రోగాలను సైతం నయం చేసే దిశగా ముందుకు సాగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను విస్తరించనున్నట్లు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని లేఖ ద్వారా వివరణ కోరగా కేంద్ర ఆయూష్ శాఖ మంత్రి ప్రతాప్ రావు జాధవ్ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ బుధవారం ఢిల్లీలో మీడియాకు వివరించారు. మారుతున్న కాలానుగుణంగా ప్రజలు ప్రమాదకరవ్యాధుల భారిన పడుతున్నారని, ఈ విషయాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు, 11,274 మందిరాలను దేశవ్యాప్తంగా నిర్మించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఏపీలో 126 నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

పీఈఎస్‌కు

నెంబర్ వన్ ర్యాంకు

అవార్డు అందుకుంటున్న పీఈఎస్ ప్రిన్సిపాల్ కృష్ణబాబు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఇండియా స్కూల్ మెరిట్ అవార్డ్స్ - 2024లో భాగంగా ఈనెల 10న బెంగళూరులో ఇండియా టాప్ స్కూల్ విన్నర్స్‌ను సత్కరించడం జరిగింది. ఇందులో భాగంగా 1760 పాఠశాలలను సర్వే చేసి,15 రకాల పని తీరులను దృష్టిలోకి తీసుకొని, 400 సిబిఎస్ఇ, ఐసిఎస్ఇ పాఠశాలలను ఎంపిక చేయడం జరిగింది. వీటిలో చిత్తూరు జిల్లాకే పీఈఎస్ పబ్లిక్ పాఠశాల మొదటి ర్యాంకు సాధించడం జరిగింది. దీనికి సంబంధించి ఎడ్యుకేషన్ న్యూస్ నెట్వర్క్ సంస్థ చేతుల మీదుగా పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణబాబు అవార్డు అందుకోవడం జరిగింది. ఆయన మాట్లాడుతూ మొదటి ర్యాంకు పాఠశాలకు రావడానికి పిల్లల నైపుణ్యం, తల్లిదండ్రుల తోడ్పాటు, ఉపాధ్యాయుల కృషి, యాజమాన్యం సూచనలే కారణమని కొనియాడారు.

కేరళ పట్ల బిజెపి కక్షసాధింపు వైఖరిని ఖండిస్తూ

రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి- పలమనేరు: కేరళలోని కమ్యూనిస్టు వామపక్ష ప్రభుత్వం పట్ల, ప్రజల పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కక్ష సాధింపు వైఖరి తగదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల్ రాజు అన్నారు. కేరళ రాష్ట్రానికి కేంద్రం బిజెపి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా రైతు, మహిళా శ్రామిక కార్మిక ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో జిల్లా పలమనేరు సీఐటీయూ ఆఫీస్‌లో బుధవారం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి అన్నూరి ఈశ్వర్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఓబుల్ రాజు, సిఐటియు అధ్యక్షులు గిరిధర్ గుప్తా, ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి, ఈశ్వర్ మాట్లాడుతూ కేరళలోని వామపక్ష ప్రభుత్వం విద్య, వైద్యం, స్థానిక సంస్థలకు అధికారులు, నిధులు, రైతులకు గిట్టుబాటు ధరలు, కార్మికులకు కనీస వేతనాలు, చౌక డిపోల ద్వారా ప్రజలకు 16 రకాల నిత్యావసర వస్తువులు అందిస్తు ఆదర్శవంతమైన పాలన అందిస్తుందన్నారు. అటువంటి వామపక్ష ప్రభుత్వాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజకీయ కుట్రతో రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వకుండా ఆర్థికంగా దెబ్బతీయాలని చూస్తోందని విమర్శించారు. ఆ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంతంలో వరదలకు కొండచర్యలు ఇరిగిపడి వేలాదిమంది చనిపోయారని, వేలకోట్ల రూపాయల నష్టం జరిగిందని దీనిపై ప్రపంచం అంతా స్పందించిన కేంద్ర బిజెపి ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇలాంటి సమయంలో కేరళ ప్రజలకు, ప్రభుత్వానికి అన్ని ప్రాంతాల ప్రజలంతా సంఘీభావం తెలిపాలని కోరారు. ప్రజల ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు ధారపోస్తూ, ప్రజలపై బారాలు వేస్తూ రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న బిజెపి, మోడి విధానాలను ప్రజలంతా వ్యతిరేకించాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, పాకాల సుబ్రహ్మణ్యం, ఎల్లప్ప పాల్గొన్నారు.

పెత్తందార్లం కాదు ప్రజాసేవకులం

కలెక్టర్ల సమావేశంలో సిఎం చంద్రబాబు

కలెక్టర్ల సమావేశంలో చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్రంలో ప్రతి అధికారి పెత్తందారులా కాకుండా ప్రజాసేవకుడిలా పనిచేయాలని, 'పీపుల్ ఫస్ట్' అనేది మన విధానమని, 'హెల్తీ-వెల్తీ-హ్యాపీ' మన నినాదం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాల కలెక్టర్లతో అన్నారు. ప్రజాసమస్యలను ఒక అధికారిలా కాకుండా.. మానవతా కోణంలో చూడాలని చెప్పారు. ప్రజలతో మన ప్రవర్తన మర్యాదపూర్వకంగా ఉండాలని, మనం మంచి పనులు చేస్తే ప్రజలు కచ్చితంగా అభినందిస్తారని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా సమస్యలు తెలుసుకోవడం, ప్రజల వినతుల వేగంగా పరిష్కరించడం అధికారుల ప్రథమ ప్రాధామ్యాలుగా ఉండాలన్నారు. బుధవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖల కార్యదర్శులు, విభాగాధిపతులు, 26 జిల్లాలకు చెందిన కలెక్టర్లతో రెండవ జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి గడిచిన 6 నెలల పాలనపైనా, భవిష్యత్ ప్రణాళికలపైనా చర్చించారు.

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు సురక్షితం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఒ ప్రభావతి

సమావేశంలో మాట్లాడుతున్న డిఎం అండ్‌హెచ్ఒ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మాతా శిశు సంరక్షణ, వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల మానిటరింగ్ పై ప్రోగ్రాం అధికారులకు నియోజకవర్గాలను అలాట్మెంట్ చేస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఒ ప్రభావతి దేవి దిశా నిర్దేశం చేశారు. ఉప వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్‌కు పలమనేరు నియోజకవర్గం, డిఐఓ డాక్టర్ హనుమంతరావుకు పుంగనూరు నియోజకవర్గం, డిబిసిఎస్ డాక్టర్ అర్పితకు పూతలపట్టు నియోజకవర్గం, ఆర్‌బిఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ శిరీషకు నగరి నియోజకవర్గం, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాసరావుకు కుప్పం నియోజకవర్గం, మలేరియా అధికారి డాక్టర్ అనిల్ కుమార్‌కు గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం అలాట్మెంట్ చేసి అన్ని ప్రోగ్రాములు మానిటర్ చేయాలని ఆదేశించారు. అలాగే కాన్పులు తక్కువగా చేస్తున్న పిహెచ్‌సిలపై ప్రత్యేక నిఘా పెట్టి మాత శిశు సంరక్షణను ఇంప్రూవ్ చేయాలని తెలిపారు. చంటి బిడ్డలకు వేయవలసిన టీకాలను డ్యూ డేట్ ప్రకారం మాత శిశు సంరక్షణ కార్డులో ఎంట్రీ వేయించి ఇప్పించటం, ఐరన్ సిరప్ 100 డోసులు వారానికి రెండు చొప్పున పూర్తి చేయటం తప్పక చేసినట్లయితే మాత శిశు మరణాలు లేకుండా చూడవచ్చు అని తెలిపారు.

బయటపడ్డ హైవే దందా

- డీఈటీ వర్క్ పేరిట స్వాహా చేసిన పూర్వపు ఎఫ్ఆర్‌వో
- కూపీ లాగుతున్న ఉన్నతాధికారులు

ప్రజాశక్తి, పలమనేరు:

అటవీశాఖే కదా.. మనల్ని ఎవరు అడు గుతారులే.. అనుకున్నారేమో. ఎక్స్ప్రెస్ హైవే మార్గంలో అడ్డుగా ఉన్న అటవీ వృక్షాలను నరికి సంబంధిత పరిహారం రూ.27లక్షలను చెల్లించారు. ఈ మొత్తాన్ని సంబంధితశాఖకు చెల్లించ కుండానే ఓ ఫారెస్ట్ అధికారి దిగమింగేశారు. దీనిపై జిల్లా ఫారెస్ట్ అధికారిణి, మరోవైపు ఇంటెలిజెన్స్ వర్గాలు రహస్య విచారణ చేస్తున్నట్టు సమాచారం. వివరాల్లోకి వెళ్తే... కర్ణాటకలోని హొసకోట నుంచి తమిళనాడులోని శ్రీపెరంబుదూర్ దాకా ఎక్ప్రెసైవే రోడ్డు పనులు సాగుతున్నాయి. ఈ రోడ్డు పలమనేరు మండలంలోని కౌండిన్య అడవిలో మొగిలి ఘాట్‌కు ఆనుకొని వెళ్తుంది. రోడ్డు నిర్మాణం కోసం హైవే వాళ్లు అడవిలోని రోడ్డు మార్గంలోని చెట్లను తొలగించాల్సి వచ్చింది. ఇందుకోసం ఫారెస్ట్ శాఖకు అక్కడున్న వృక్షాలను విలువకట్టి రూ.27లక్షలుగా నిర్ణయించి ఆ మొత్తాన్ని స్థానిక ఫారెస్ట్ అధికారులకు అందించారు. అయితే ఈ పనులనుకు సంబంధించి గతంలో ఇక్కడ పనిచేసిన ఎఫ్ఆర్వో శివన్న డిపార్ట్మెంటల్ ఎక్స్‌ట్రాక్షన్ పనుల పేరిట చేయించి ఆ డబ్బును స్వాహా చేసినట్టు తెలిసింది. అప్పట్లోనే స్థానిక ఫారెస్ట్ సిబ్బంది దీనిపై వ్యతిరేకించారు. ఇది డిపార్ట్మెంటల్ ఎక్స్‌ట్రాక్షన్ పనులుగా ఉన్నందున ఆ ఫైల్‌లో సంబంధిత ఎఫ్ఎస్వో, ఎఫ్బివోలు సైతం సంతకాలు చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ జరిగిన అక్రమాలను గ్రహించినవారు తాము సంతకాలు చేసే ప్రసక్తేలేదని తేల్చి చెప్పారు. కానీ ఈ ఫైల్ ఎలా ముందుకెళ్లిందో అర్థం కాలేదు. ఫారెస్ట్ శాఖకు సంబంధించిన ఆడిట్లో ఈ విషయాన్ని ఆడిటర్లు తెలుసుకున్నారు. ఉన్నతాధికారులు దీనిపై డిపార్ట్మెంటల్ విచారణ సైతం చేస్తున్నట్టు తెలిసింది. గతంలో ఇక్కడ ఎఫ్ఆర్వోగా పనిచేసిన శివన్న బదిలీపై ఇప్పుడు ఫారెస్ట్ ఎఫ్ఆర్వోగా వైఎస్సార్ జిల్లా, రాజంపేట రేంజ్లో ఉన్నారు. ప్రస్తుతం పలమనేరు ఎఫ్ఆర్వోగా నారాయణ విధుల్లో ఉన్నారు. జిల్లా అధికారులు ఈ విషయంపై రహస్యవిచారణ చేస్తున్నారు పూర్తి వివరాలు డిఎఫ్ఓ వివరించాల్సి ఉంది. కాగా గతంలో పనిచేసిన ఎఫ్ఆర్ఓ శివన్న పలమనేరులో బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పలు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై సంబంధించిన బాధిత రైతులు కూడా నష్టపరిహారం విషయాల్లో గోల్మాల్ జరిగినట్లు ఆరోపించారు. ఈ ఘటనపై సబ్ డిఎఫ్ఓ వేణుగోపాల్‌ను వివరణ కోరగా.. ఆరోపణల మాట నిజమే అని దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే పూర్తి వివరాలు అందిస్తామన్నారు.

14న సాగునీటి సంఘాల ఎన్నిక

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని ఆయకట్టు చెరువుల సాగునీటి యాజమాన్య సంఘాల ఎన్నికలను ఈనెల 14వ తేదీన నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నేత మునస్వామి, టిడిపి మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. బుధవారం టిడిపి పార్టీ కార్యాలయంలో నేతలు కార్యకర్తలతో సమావేశం అయ్యారు. వారు మాట్లాడుతూ మండలంలోని ఏడు చెరువులకు టిడిపి బలపరిచిన అభ్యర్థులను ఎన్నుకునేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నరసింహులు, నారాయణ చారి, శ్రీనివాసులు రెడ్డి, గంట్లప్ప గౌడు, శ్రీరాములు రెడ్డి ,వెంకటాచలం, గిరిదాసు, విజయ్ రెడ్డి, అల్లి శీన, సుబ్రి, బాలరాజు, నియాజ్, మంజునాథ్ పాల్గొన్నారు.

ప్రమాదం అంచున వంతెనలు

- పట్టించుకోని అధికారులు
- మదన పడుతున్న ప్రజలు

భారీ వరదల కారణంగా వంతెనలు కొట్టుకుపోయి సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో మట్టితో ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెనలే ప్రజలకు దిక్కుగా మారింది. చినుకు పడితే మట్టి కాస్త బురదమయంగా మారి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చిన్నపాటి వరదలు వచ్చినా మట్టి వంతెనలు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.

ప్రజాశక్తి- పూతలపట్టు

ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యానికి.. ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో తుఫ్లి తుపానుతో భారీ వరదలు వచ్చి అనేక వంతెనలు కొట్టుకుపోయాయి. దీంతో సుమారు 20 రోజులపాటు కొన్ని గ్రామాల జనజీవనం స్తంభించిపోయింది. వరదలు ఒకవైపు.. వంతెనలు కొట్టుకోపోవడంతో రహదారి లేక వందలాది గ్రామాల ప్రజలు సొంత గ్రామాలకే పరిమితం కావలసి వచ్చింది. వంతెన తాత్కాలిక నిర్మాణంలో భాగంగా అప్పటి వైసిపి ప్రభుత్వం మట్టితో తూతూమంత్రంగా పనులు పూర్తి చేసి చేతులు దులుపుకుంది. అప్పటి నుంచి వరదలు రాకపోవడంతో కాస్త ఊరటనిస్తోంది. కానీ చిన్నపాటి వరదలు వచ్చినా మట్టి వంతెనలు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. తిరిగి జనజీవనం స్తంభించే ప్రమాదం ఉంది. ప్రమాదం రాకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు

పూతలపట్టు మండలంలో..

పూతలపట్టు మండలంలో ప్రధానంగా ఆకనాంబట్టు, సంజీవ నాయుని ఊరు, పూతలపట్టులోని నీవా నదిపై ఉన్నవి పెద్ద వంతెనలు. ఈ వంతెనలు అనేక గ్రామాలకు అనుసంధానంగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ వంతెనలు ప్రమాదకర దశలో ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వంలో వచ్చిన వరదలతో ఈ వంతెనలు పూర్తిగా కొట్టుకుపోయాయి. అప్పటినుంచి ఎవరు పట్టించుకోకపోవడంతో ప్రజలు తాత్కాలిక వంతెనలనే వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం చినుకు పడితే ఈ వంతెనలు కాస్త బురద మయంగా మారి వాహన చోదకులను ఇబ్బందులకు గురిచేస్తుంది. పూతలపట్టు మండల కేంద్రంలోని నీవా నదిపై ఉన్న వంతెన అధ్వానంగా మారింది. పెనుమూరు మండలానికి అనుసంధాంగా ఉన్న ఈ వంతెన మరో 36 గ్రామాల ప్రజల రాకపోకలకు అణువుగా ఉంది. ఇలాంటి వంతెన ప్రస్తుతం ప్రమాదకర దశలో ఉంది.

కూటమి ప్రభుత్వం స్పందించాలి..

ప్రస్తుతం ప్రమాదకరంగా ఉన్న వంతెనలపై కూటమి ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరదలతో మరోమారు జనజీవన స్తంభించక ముందే చర్యలు చేపడితే బాగుంటుందని వారు కోరుతున్నారు.

17 నుంచి ఉపకరణాల నమోదు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకు జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు ఉపకరణాల నమోదుకు గుర్తింపు శిబిరాలను నిర్వహించనున్నట్లు ఇంచార్జి జిల్లా కలెక్టర్ జి.విద్యాధరి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 8 రోజులపాటు శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని ఇందులో భాగంగా 17వ తేదీ చిత్తూరు పిసిఆర్ ప్రభుత్వ పాఠశాలలో 18న ఎస్ఆర్ పురం జెడ్పి హైస్కూల్‌లో 19న పూతలపట్టు జెడ్‌పి హైస్కూల్‌లో, 20న నగరి పిసిఎన్ ప్రభుత్వ బాలురు హైస్కూల్, 21న పుంగనూరు వేంకటేశ్వరస్వామి గుడి వెనుక గల బిఆర్ ప్రభుత్వ హైస్కూల్, 22న పలమనేరు జెడ్‌పి హైస్కూల్, 23న కుప్పం ఆర్‌టిసి బస్‌స్టాండ్ దగ్గర గల రాజవారి పార్క్, 24న రామకుప్పం జెడ్‌పి హైస్కూల్‌లో శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈశిబిరాలకు హాజరయ్యే అభ్యర్థులు 2 సెట్లు ధృవీకరణపత్రాలను తీసుకురావాలని అందులో విభిన్న ప్రతిభావంతులు ఉపకరణాల దరఖాస్తుకు వికలత్వ ఫోటోలు 4, ఆధార్ కార్డు, సదరం సర్టిఫికేట్, యూడిఐడి కార్డు, రశీదు, రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, వయోవృద్ధుల ఉపకరణాలకు ఫోటోలు 4, ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకుని దగ్గరలో సౌకర్యంగా ఉన్న శిబిరాలకు హాజరై ఉపకరణాల కోసం నమోదు చేసుకోవచ్చునని జెసి ప్రకటనలో తెలిపారు.

కాలువలలో పూడికతీత

ప్రజాశక్తి వార్తకు స్పందన

కాలువల్లో పూడికలు తీసి మురుగు వెళ్తుత్తున్న దృశ్యం

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల నుంచి నంజంపేట వెళ్లే సోమల సమీపంలోని చర్చి. పాల డైరీ వద్ద మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ వాహనదారులకు పాదాచారులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తూ ఉందన్న వార్త ఈనెల తొమ్మిదవ తేదీ ప్రజాశక్తిలో ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి మజాహర్, కూటమి నేతలు సర్పంచ్ రాజేశ్వరమ్మ కలసి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటిని మురుగునీటి కాలువలలోనే వెళ్లే విధంగా చేసి రోడ్డుపై మట్టిని తోలి బాగు చేశారు. మురుగునీటి కాలువలు ధ్వంసం కావడం వల్ల మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ ఉందని నూతన మురుగునీటి కాలువలను నిర్మించి శాశ్వత పరిష్కారం చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ప్రజాశక్తిని పలువురు ప్రశంసించారు.

త్రో బాల్ పోటీలలో

విజేతలుగా నిలిచిన కందూరు విద్యార్థులు

క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- సోమల: నవంబర్ 9వ తేదీ మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పుంగనూరు జోన్ త్రోబాల్ పోటీలలో కందూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతగా నిలచి తమ ప్రతిభను చాటుకున్నారు. బాలికల విభాగంలో చంద్రమాకులపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులపై కందూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు 15-08, 15-12 పాయింట్లు సాధించి విజేతగా నిలిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. బాలుర విభాగంలో సోమల ఉన్నత పాఠశాల విద్యార్థులపై కందూరు విద్యార్థులు15-10,15-13 తేడాతో విజయం సాధించి ప్రథమస్థానంలో నిలిచారని వ్యాయామ ఉపాధ్యాయులు చిన్నప్ప తెలిపారు. జోనల్ స్థాయిలో నిర్వహించిన బాలబాలికల పోటీలలో కందూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట రమణారెడ్డి ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

సోమల విద్యార్థుల ప్రతిభ

చిత్తూరు జిల్లా పుంగనూరు జోన్ త్రోబాల్ పోటీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోమల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పుంగనూరు జోన్‌లో ద్వితీయ స్థానం సాధించారు. ఈనెల తొమ్మిదవ తేది సోమల మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కందూరులో పుంగనూరు జోన్ పాఠశాలల బాలుర త్రో బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పుంగనూరు జోన్ పరిధిలోని వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోమల విద్యార్థులు ప్రతిభ కనబరిచి త్రో బాల్ జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారని వ్యాయామ ఉపాధ్యాయులు కరుణానిధి తెలిపారు. ఈవిజయం పట్ల ప్రధానోపాధ్యాయులు హరినాథ్, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసి క్రీడాకారుల్ని అభినందించారు.

ఇంటర్వ్యూలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

ప్రజాశక్తి- విజయపురం: ఇంటర్వ్యూలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని స్కిల్ ఇండియా శిక్షకులు, నింద్ర మండల విద్యాశాఖాధికారి శ్రీధర్ రాజు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మాధవరం ప్రభుత్వ ఐటిఐ విద్యార్థులకు స్కిల్ డెవలెప్మెంటుపై అవగాహన కల్పించారు. ఐటిఐ అనంతరం విద్యార్థులకు ఉపాధి పొందడానికి చేసే ప్రయత్నంలో ఎదుర్కొంటున్న సమస్యలను, పరిష్కారమార్గాలను వివరించారు. ఇన్చార్జి ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకులు అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

భూ సమస్యలపై వినతుల వెల్లువ

భూ సమస్యలు లేని గ్రామాలుగా కావాలి
ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం

భూ సమస్యలు లేని గ్రామాలుగా తయారు చేయాలని పూతలపట్టు శాసనసభ్యులు కలికిరి మురళీమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని నల్లగాంపల్లి గ్రామంలో తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో భూ సమస్యల అధికంగా ఉన్నాయని భూ సమస్యల పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ప్రారంభించిందని గ్రామంలోని సమస్యలను ప్రతి ఒక్కరు పరిష్కరించుకోవాలన్నారు. అధికారుల చుట్టూ తిరగలేక భూసమస్యలు అలాగే ఉన్నాయని, వాటి సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సబ్‌రిజిస్టర్ యుగంధర్, ఆర్ఐ మధుసూదన్, సర్వేయర్ లావణ్య, మండల టిడిపి అధ్యక్షులు జయప్రకాశ్ నాయుడు, ఇంచార్జ్ ధరణి పాల్గొన్నారు.

చౌడేపల్లి: మండలం పంచాయతీ కేంద్రం శెట్టిపేటలో బుధవారం రెవెన్యూ సదస్సుకు తమ భూ సమస్యలు పరిష్కరించాలంటూ రైతుల నుంచి 35 వినతులు అందాయి. అలాగే శెట్టిపేట, ఎర్రపల్లి మధ్యలో ఉన్న రోడ్డు అన్యాక్రాంతమైందని దారి చూపాలని బ్యాంకు రెడ్డప్ప అధికారులకు విన్నవించుకున్నారు. 43రోజుల్లో సమస్యలు పరిష్కరించబడతాయిని డిప్యూటి తహశీల్దార్ మాధవి తెలిపారు. లక్ష్మీపతిరాజు, నారాయణరాజు, సర్పంచ్ ఓబుల్ రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర, మండల సర్వే గుణశేఖర్, ఆర్ఐ భారతి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: తహశీల్దార్ లోకనాథపిళ్ళై ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 56 కనికాపురం, మధ్యాహ్నం ఆర్ఆర్ పురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సదస్సులో భూ సమస్యలపై 5 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. డిటి రవికుమార్, సర్వేయర్, వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని ధర్మపురి పంచాయతీ పరిధిలో విఆర్ఓ రమణ అధ్యక్షతన బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఎంఆర్ఐ బి.సరిత మాట్లాడుతూ ప్రజల వద్ద నుండి వివిధ సమస్యలపై 43 అర్జీలు అందాయని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ కిషోర్ కుమార్, వీఆర్ఏ పద్మావతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విజయపురం: మండలంలోని ఆలపాకంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో రెవెన్యూ సమస్యలపై రైతులు తహశీల్దార్ కిరణ్‌కు వినతిపత్రం అందించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి సమస్యను పరిష్కరించడానికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ అశోక్, మండల సర్వేయర్ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త బోరు డ్రిల్లింగ్

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు

మండలంలోని వీరకనెల్లూరులో వర్షాల కారణంగా చెరువులో ఉన్న బోర్లు మునిగిపోవడంతో ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడింది. ఈ విషయం స్థానికులు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి ఎంపిడిఓ హరిప్రసాద్ రెడ్డిని పిలిపించి ప్రజల తాగునీటి సమస్యను తీర్చాలని ఆదేశించారు. దీంతో బుధవారం ఎంపిడిఓ కొత్తగా బోరు డ్రిల్లింగ్ చేసి ప్రజల తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకొన్న తీగలు

ప్రజాశక్తి- విజయపురం :

నగరి రూరల్ పరిధి తెరణిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు పిచ్చి మొక్కలు అల్లుకున్నాయి. దీంతో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు అంటున్నారు. అంతే కాకుండా ట్రాన్స్‌ఫార్మర్‌కు పిచ్చి మొక్కలు అల్లుకోవడంతో మొక్కలకు విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉందంటున్నారు. అధికారులు వాటిని తొలగించాలని కోరుతున్నారు.

ఇన్‌ఛార్జి ఎంఈవోగా సిద్ధరామయ్య

ప్రజాశక్తి - సదుం:

మండలం ఇన్‌ఛార్జి ఎంఈవోగా చెట్టిపల్లి సిద్ధరామయ్య స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను ఎంఈఓ 2 దామోదరం, ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు నరసింహులు, ప్రసాద్, నరేష్, సుబ్రహ్మణ్యం, ఎంఆర్‌సి సిబ్బంది, ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

బాలిక బంగారు భవిష్యత్తుకు పునాది

జిల్లా స్త్రీ సంక్షేమశాఖ పీడీ కె.హైమావతి

ప్రజాశక్తి- విజయపురం (నగరి): కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని, ఉజ్వల, ఆరోగ్యకరమైన, సాధికారిత దిశగా ఆమె వేసే అడుగుకు సమిష్టి కృషితో చేయూతనిద్దామని జిల్లా స్త్రీ సంక్షేమశాఖ పీడీ కె.హైమావతి అన్నారు. బుధవారం స్థానిక ఐడీసీఎస్ కార్యాలయంలో నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి స్థానిక అధికారులు ఆచరించవలసిన పద్ధతులపై శిక్షణ అందించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగుపరచడానికి కిశోరి వికారం మంచి అవకాశమన్నారు. బాలికలు తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేలా సమగ్రాభివృద్ధి సొంతం చేసుకొనేలా ఈకార్యక్రమం ద్వారా చేయూత నివ్వనున్నట్టు వివరించారు. 11 నుంచి 18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపరచడం ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. డాక్టర్ సుస్మిత మాట్లాడుతూ కిశోర బాలికలు తీసుకోవలసిన వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహార, ఆవశ్యతను వివరించారు. ఎంపీడీవో సతీష్, నోడల్ అధికారి ఇ.జయంతి, మున్సిపల్ మేనేజర్ శేఖర్, ఏపీఎం మోహన్, డాక్టర్ ఎయిల్ అరసన్, ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్న, సిరీడ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు గిరిజ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



వెదురుకుప్పం మండలం, చవటగుంట కూడలిలో బుధవారం నలుగురు చిన్నారులను బైక్‌లో ఎక్కించుకొని వెళ్తున్న వాహనదారుడు. ఇది ప్రమాదం అని తెలిసినా పట్టించుకోని తల్లిదండ్రులు.. ఇకనైనా ప్రమాదాలు జరుగక ముందే.. ఆలోచించండి.. రోడ్డు నిబంధనలు పాటించండి..

హెల్త్ సెంటర్‌కు అనారోగ్యం

ప్రజాశక్తి- విజయపురం (నగరి)

నగరి రూరల్ పరిధి తెరణి హెల్త్ సెంటర్ చుట్టూ పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. బుధవారం, శనివారం గర్భవతులు వైద్యపరీక్ష కోసం వస్తుంటారు. అయితే పిచ్చి మొక్కలు కారణంగా దోమలు ఎక్కువుగా ఉన్నాయని, విషపురుగు సైతం ఉండే ప్రమాదం ఉండటంతోపాటు దోమకాటుతో గర్భవతులు, బాలింతలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్యం మెరుగుపరచడం అటూ ప్రచారం చేసే వైద్యసిబ్బంది తన కార్యాలయం చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించకపోవడం ఏమటని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

మల్లేశ్వరపురంలో పేయి దూడల ప్రదర్శన

ప్రజాశక్తి- సోమల: మేలైన సంకరజాతి పశువుల ద్వారా రైతులు పాల దిగుబడి పెంపొందించుకొని ఆదాయాన్ని మరింతగా పొందేందుకే పేయి దూడలు మాత్రమే జన్మించే పథకం ముఖ్య ఉద్దేశమని జిల్లా పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ప్రభాకర్ అన్నారు. బుధవారం సోమల మండలం ఆవులపల్లి పంచాయతీ మల్లేశ్వరపురం గ్రామ సమీపంలోని మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద పేయి దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని మండల పశుసంవర్ధక శాఖ వారు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ మేలైన పశుసంపద కలిగిన గ్రామాలను ఎంపిక చేసి ఆ పశువులకు లింగ నిర్ధారిత వీర్యనాలికలను ఉపయోగించి మేలైన సంకరజాతి దూడలను పుట్టించడమే ఈ పథక లక్ష్యమన్నారు. చిత్తూరు జిల్లాలో ఈ పథకం ద్వారా సోమల మండలంలో ఇప్పటికే మొత్తం 95 పెయి దూడలు పుట్టడంతో జిల్లాలో మొదటిస్థానంలో నిలిచిందని ఇందుకు కృషి చేసిన సోమల మండల పశువైద్య సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడు మంచి లక్షణాలు కలిగిన దూడలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ ఉపసంచాలకులు బాలసుబ్రమణ్యం, సోమల సహాయ సంచాలకులు శ్రీనివాసులు నాయుడు, నగరి సహాయ సంచాలకులు వాసు, సోమల పశువైద్యాధికారిని చందన ప్రియ, రొంపిచర్ల పశు వైద్యులు శ్రీధర్, పులిచెర్ల పశువైద్యులు తబ్రీజ్ బాష, సదుం పశువైద్యులు ప్రదీప్, పశువైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పశువైద్యాధికారిని చందన ప్రియ

జర్నలిస్టులపై దాడి అమానుష చర్య

చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జర్నలిస్టులపై విచక్షణారహితంగా దాడి చేసిన సినీ నటుడు మోహన్ బాబుపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్), వామపక్ష, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరంలో మంగళవారం టీవీ9, సుమన్ టీవీ ప్రతినిధులపై మోహన్ బాబు, ఆయన అనుచరులు చేసిన దాడిని నిరసిస్తూ చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టులు, వామపక్షాల నేతలు దళిత సంఘాల ప్రతినిధులు బుధవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. జర్నలిస్టుల నిరసన కార్యక్రమంతో చిత్తూరులో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. వారు మాట్లాడుతూ సినీనటుడు మోహన్‌బాబు జర్నలిస్టులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జర్నలిస్ట్ అయ్యప్ప మాల ధరించి దీక్షలో ఉన్నాడన్న కనీస ఇంగితజ్ఞానం కూడా లేకుండా ఆయనపై దాడి చేయడం అతని ఆటవిక చర్యకు నిదర్శనమని అన్నారు. మానవత్వాన్ని మరచి మైక్‌తో తలపై దాడి చేసి తీవ్రంగా గాయపరచిన మోహన్ బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.జర్నలిస్టులపై దాడులు పునరావృతం కాకుండా పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ చిత్తూరు జిల్లా కన్వీనర్ వరదరాజులు, కో – కన్వీనర్ జయ ప్రకాష్, సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, సిపిఐ నగర కార్యదర్శి గోపీనాథ్, మహిళా నాయకురాలు రమాదేవి, ప్రజాసంఘాల నేతలు మణి, దాసరి చంద్ర, విజయ్ కుమార్, కుమారి, సీనియర్ జర్నలిస్టులు కేశవులు, వరదరాజులు, జయచంద్ర, జయరాజ్, కపానందరెడ్డి, మురళి, దినేష్, కుబేంద్ర, సాక్షి మురళి, బాలసుబ్రమణ్యం, ఉమాశంకర్, నాగరాజు, హేమంత్, అప్పు, వార్త చంద్ర, యాదవేంద్రరెడ్డి, శ్రీకాంత్, ప్రసాద్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: జర్నలిస్టులపై దాడి అమానుషమని మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు అరవింద్ బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మోహన్ బాబును అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి శివశంకర్, కోశాధికారి శంకరన్, సభ్యులు ప్రతాప్, సీన్ ఉమాపతి, రామచంద్ర, బాలయ్య, చాంద్ బాషా, జ్యోతినాథ్ పాల్గొన్నారు.

కుప్పం టౌన్: పాత్రికేయులపై దాడికి దిగిన సినీనటుడు మోహన్ బాబుపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవాలని కుప్పం మండలానికి చెందిన విలేకరులు డిమాండ్ చేశారు. బుధవారం జర్నలిస్టులు పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ కూడలి వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని నిరసన తెలియజేశారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న మోహన్ బాబు పాత్రికేయులపై దాడి చేయడం దారుణమన్నారు. ఈ ఘటనపై పోలీసు వారు స్పందించి వెంటనే చట్టరీత్యా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పాత్రికేయులకు మద్దతుగా ఎన్‌డిఏ కూటమి నాయకులు జిమ్ దాము, జాకీర్ అహ్మద్, సోము, ఉమాపతి, నరేష్, బుజ్జి పాల్గొని సంఘీభావం తెలిపారు. కుప్పం మండలానికి చెందిన పాత్రికేయులు పాల్గొన్నారు

కుప్పంలో..

క్రైం న్యూస్

1100 లీటర్ల సారా ఊట ధ్వంసం

ప్రజాశక్తి- విజయపురం (నగరి): మండలంలోని మాంగాడు దళితవాడలో చిత్తూరు డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో డివిజన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సిబ్బందితో బుధవారం మాంగాడు ప్రాంతంలో సారాపై విస్తృతంగా దాడులు నిర్వహించారు. దళితవాడలో దాడులు నిర్వహించి 5 లీటర్ల నాటు సారాని స్వాధీనం చేసుకొని ఎస్.దాము (40) అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అనంతరం దళితవాడకు పడమర దిక్కున ఉన్న మురుగునీటి కాలువ వద్ద 75 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. మాంగాడు దళితవాడకు ఉత్తర దిక్కున మూడు కిలోమీటర్ల దూరంలో ఇందిరమ్మ చెరువు ప్రాంతంలో 1100 లీటర్ల సారా ఊటను కనుగొని ధ్వంసం చేశారు. సదరు మూడు కేసులను తదుపరి చర్యల నిమిత్తం నగరి ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. ఈదాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ సురేంద్రబాబు, మునిరామయ్య, బీఎం క్రిష్ణయ్య, పీసీలు బి.విజయ్, కెఎస్ రాజ్‌దీప్, గీత పాల్గొన్నారు.

రూ.1.50 లక్షలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు : ఈనెల 1వతేదీన రోడ్డు ప్రమాదంలో మోత రంగనపల్లికి చెందిన గజేంద్ర యాదవ్ మృతి చెందారు. బుధవారం కుటుంబాన్ని అఖిల భారతీయ యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు కవితా సురేష్, ప్రధాన కార్యదర్శి నవీన్, శ్రీధర్ యాదవ్, హరీష్ యాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా కవితా సురేష్ యాదవ్, శ్రీధర్ యాదవ్ మాట్లాడుతూ గజేంద్ర యాదవ్ పిల్లల భవిష్యత్తు కోసం సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు అన్నా రామచంద్ర యాదవ్ ఆదేశాల మేరకు ఫిక్స్ డిపాజిట్ కోసం ఇద్దరు బాలికలకు రూ.1,50,500 నగదు అందజేశామన్నారు. యాదవ సంఘం తరపున బాధిత కుటుంబానికి భరోసా కల్పిస్తామని నేతల పేర్కొన్నారు. జ్యోతి, ప్రతిభ, నాగయ్య, కృష్ణమూర్తి, అశోక్, యువరాజ్, మురళి పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి- సోమల: మండలంలోని పొదలకుంటపల్లి పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి ఫయాజ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ మురుగునీటి కాలువలలో చెత్తాచెదారం ఎత్తివేయడం, రోడ్లకు ఇరువైపులా గ్రామ వీధులలో పిచ్చి మొక్కలు తొలగించడం, రోడ్లపై ఇసుక మేటలను తొలగించడం చేశామన్నారు. ప్రజలు కూడా పంచాయతీ వారికి సహకరించి గ్రామ సమీపంలో పేడ దిబ్బలు వేయడం, మురుగునీటి కాలువలలో చెత్తాచెదారం వేయడం లాంటివి చేయకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని కోరారు. తొలగించిన చెత్తాచెదారాన్ని అప్పటికప్పుడు ట్రాక్టర్ల ద్వారా తరలించారు.

చెత్తాచెదారాన్ని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న దృశ్యం

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- పలమనేరు: నెల 13న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల వద్ద అన్నదాతలకు అండగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న నిరసన కార్యక్రమం పోస్టర్లను పలమనేరు మాజీ శాసనసభ్యులు ఎన్. వెంకటే గౌడ ఆధ్వర్యంలో వైసిపి కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. చిత్తూరు పట్టణంలో జరగబోవు ఈకార్యక్రమంలో పలమనేరు నియోజకవర్గ రైతులందరూ పెద్ద ఎత్తున వచ్చి పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

చిరు వ్యాపారులను ఆదుకోండి

చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షులు మంజునాథ్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: చిరువ్యాపారుల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని వ్యాపారుల సంఘం అధ్యక్షులు మంజునాథ్ కోరారు. పట్టణ పరిధిలోని చిరువ్యాపారులు బుధవారం రాజావారి పార్కులోని కమ్యూనిటీ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంజునాథ్ మాట్లాడుతూ పేద వ్యాపారులను ఆదుకోవడానికి పురపాలక సంఘం వారికి గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని, అలాగే మెప్మా తరపున బ్యాంకు రుణాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిరువ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముస్తాబైన చర్చిలు

ప్రజాశక్తి- పూతలపట్టు: ఈనెల 25న క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మండలంలోని చర్చులు ముస్తాబయ్యాయి. మినీ క్రిస్మస్ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని సిఎస్ఐ వైట్ ఆఫ్ మెమోరియల్ ట్రస్ట్ చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు, అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.